క్లుప్తంగా

నూతన బోరు ప్రారంభం

ఉరవకొండ: స్థాని 1వ వార్డు, 11వ వార్డు పరిధిలోని ఉల్లిగడ్డల వీధిలో నూతన బోరును ఆయా వార్డులకు చెందిన సభ్యులు శర్మాస్, భానుబీలతో పాటు పార్టీ జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు బసవరాజు ప్రారంభించారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటుటున్న తీవ్ర నీటిఎద్దడిని గమనించిన సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్ స్పందించి బోరు వేయించారు.ఈ సందర్భంగా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాజు, అన్వర్ పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏకే శర్మ

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యాన పంటలు సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు నేషనల్ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్ ఏకే శర్మ పిలుపునిచ్చారు. ఉద్యాన పంటల సాగుపై స్థానిక కేవీకేలో బుధవారం కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాధాకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అరటి, చీనీ, నిమ్మ, ద్రాక్ష, జామ, మామిడి, బొప్పాయి, దానిమ్మ, కొబ్బరి వంటి పంటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో మొక్కలను అందిస్తుందన్నారు. ఇందుకు ఐదెకరాల పొలం ఉన్న రైతులందరూ అర్హులన్నారు. సందేహాలను ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌ల ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. ఏడీహెచ్ నరసింహులు, కేవీకే శాస్త్రవేత్తలు కృష్ణమూర్తి, యుగంధర్, ఉద్యానశాఖ అధికారులు ధనుంజయ, పల్లవి, గౌసియా పాల్గొన్నారు.

హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సత్కారం



హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: పట్టణానికి విచ్చేసిన హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిల్ సభ్యులు సత్కరించారు. బుధవారం కార్యాలయంలో కౌన్సిలర్లతో కలసి వారు అభివృద్ధి తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, నాగవేణి, శారదదేవి, దేవరాజు, పుత్ర, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివ, శ్రీరామిరెడ్డి, గంగాధర్, నిజాముద్దీన్, భీమనపల్లి దివాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రామాంజనేయులు పాల్గొన్నారు.


నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇంజినీరింగ్ విభాగం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో డీఈ సురేష్, సిబ్బందితో నీటి సరఫరాపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

మట్టి తరలింపు అడ్డగింత

కూడేరు: మండలంలోని ఇప్పేరు చెరువులోని మట్టిని పొక్‌లెన్‌తో తవ్వి లారీలతో తరలించేందుకు రవి అనే వ్యక్తి బుధవారం యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా ఇతర ప్రాంతాల వారు తమ గ్రామ చెరువులో మట్టిని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి గొడవలు జరగకుండా లారీలను, పొక్‌లెన్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేనిదే మట్టి తవ్వకాన్ని చేపడుతున్నారని గ్రామస్తులు తెలపడంతో లారీలను స్టేషన్‌కు తీసుకువచ్చామని హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. తమకు అనుమతులున్నాయని మట్టి తవ్వకందారు పేపర్లు ఇచ్చారు. వాటిని పరిశీలనకు మైన్స్ అండ్ జియాలజి అధికారులకు పంపుతున్నామని ఆయన తెలిపారు.

అభివృద్ధి పథకాలు త్వరగా పూర్తిచేయండి



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ నీలమయ్య

శెట్టూరు: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని నోడల్ అధికారి నీలమయ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ తలపెట్టిన అన్ని రకాల అభివృద్ధి పనులపై సమీక్షించారు. సచివాలయాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని మండల ఇంజనీర్ కాంచనకు సూచించారు. నాడు–నేడు పనుల పురోగతిపై ఎంఈఓ శ్రీధర్‌తో తెలుసుకున్నారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ మైథిలీ, డాక్టర్ వేణు కార్తీకేయ, ఏపీఓ రమేష్, ఏపీఎం సర్దానప్ప తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండ: ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



బెళుగుప్ప: తగ్గుపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మఒడి చెక్కు పంపిణీ చేస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

థ్యాంక్యూ.. సీఎం సార్

వరుసగా నాలుగో ఏడాది కూడా అమ్మ ఒడి నగదు జమ చేసినందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే విశ్వ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

- అమ్మ ఒడి నగదు జమ చేసినందుకు తల్లిదండ్రులు, విద్యార్థుల సంబరాలు
- మాజీ ఎమ్మెల్యే విశ్వ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బెళుగుప్ప: విద్యావ్యవస్థలో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల్లో నూతన ఒరవడిని తీసుకువచ్చి దశ దిశను మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తగ్గుపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అమ్మఒడి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ పుష్పావతి తదితరులతో కలసి ఆయన విద్యార్థుల తల్లులకు అమ్మఒడి చెక్కులను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. ప్రతి విద్యార్థికీ అమ్మఒడి పథకంతో రూ.13,000 చొప్పున వారి తల్లుల బ్యాంకు ఖాతాలకు నాలుగో విడత జమ చేశారన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నరు. కార్యక్రమంలో సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, మండల అగ్రి బోర్డు చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, తహసీల్దార్ ఓబుళేసు, ఎంపీడీఓ రామచంద్ర, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు వెంకటనాయుడు, నాయకులు త్రిలోక్‌రెడ్డి, రాజగోపాల్, శేఖర్, అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరవకొండ: అమ్మ ఒడి నగదు జమ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ సంబరాలు చేసుకున్నారు. పార్టీ కోఆప్షన్ సభ్యులు పామిడిసలీం, విద్యార్థి విభాగం నాయకులు జిలాన్, ఉపాధ్యక్షుడు తేజ, మండల అధ్యక్షుడు వెలిగొండ దేవా, ప్రధాన కార్యదర్శి ఆసీఫ్, పవన్ ఆధ్వర్యంలో ఉరవకొండ ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశా ఆవరణలో సంబరాలు నిర్వహించారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు కార్యక్రమంలో పార్టీ నాయకులు అన్వర్, రఫీక్, బాబాజాన్, ముల్లాఇంతియాజ్, ఫోటోఫ్రేమ్ ఖాదర్, కిరణ్ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' సర్వే పక్కాగా చేయాలి



కణేకల్లు: సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ కేఎల్ ప్రభాకర్‌రావు

కణేకల్లు: జగనన్న సురక్ష సర్వేను పక్కా చేపట్టాలని డీపీఓ కేఎల్ ప్రభాకర్‌రావు ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి హోదాలో ఆయన సమావేశానికి హాజరై మాట్లాడారు. ఏ ఇంటిని వదలకుండా సర్వే నిర్వహించాలన్నారు. ఎవరు ఏ పథకానికి అర్హులో గుర్తించి ఆ పథకం వర్తించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 'మన బడి నాడు–నేడు' సచివాలయ భవనాలు, వైఎస్సార్ వెల్నెస్ సెంటర్లు, ఆర్బీకే భవనాల నిర్మాణాల గురించి ఆరా తీసిన ఆయన పనులు వేగవంతం చేయించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో జాప్యం చేయరాదన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం కణేకల్లులో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులతో కలిసి ఆయన పరిశీలించారు. పలు ఇళ్లకెళ్లి సర్వే విధానాన్ని గమనించి వలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలీ, ఈఓఆర్‌డీ గూడెన్న, డిప్యూటీ తహసీల్దార్ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జగనన్న సురక్ష'

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం, గుమ్మఘట్ట గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ నరసింహమూర్తి పర్యవేక్షించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రం లో జగనన్న సురక్ష కార్యక్రమంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు సర్పంచు మోనాలిసా, ఉప సర్పంచు మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, పాలక వర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని కమ్మూరులో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ చౌదరి పరిశీలించారు. అనంతరం ఆయన ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. అలాగే అరవకూరు వద్ద జగనన్న లే–అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇళ్లను తొందరగా నిర్మించుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంకే బాషా, పంచాయతీ కార్యదర్శి మురళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 16 గ్రామ సచివాలయాల సిబ్బందికి జగనన్న సురక్షా పథకం అమలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

1 నుంచి 'జగనన్న సురక్ష'

బొమ్మనహాళ్: మండలంలోని అన్ని గ్రామాల్లో జూలై 1 నుంచి 27 వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షకీలాబేగం బుధవారం తెలిపారు. ఇందుకోసం ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు బృందాలుగా పర్యవేక్షిస్తారన్నారు.

సంక్షేమ' సారథి సీఎం జగన్



తగ్గుపర్తిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: రాష్ట్రంలో పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల గడప వద్దకే పథకాలు అందిస్తూ సంక్షేమ సారథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు కొనియాడుతున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని తగ్గుపర్తిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేకు వైస్ ఎంపీపీ పుష్పావతి, నాయకులు శ్రీరాములు, రాజగోపాల్, ఎస్‌కే ఎర్రిస్వామి, నరేంద్ర, ప్రతాప్‌నాయుడు, నారా హరికృష్ణ, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగేవారమని, నేడు ఇంటి ముంగిటకే వచ్చే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు మాజీ ఎమ్మెల్యేతో కలసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదర్శపాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంను చేసుకుంటేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రతి కుటుంబం ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, బెళుగుప్ప, తగ్గుపర్తి సహకార సంఘ అధ్యక్షులు శివలింగప్ప, శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, తహసీల్దార్ ఓబుళేసు, ఎంపీడీఓ రామచంద్ర, నాయకులు త్రిలోక్‌రెడ్డి, పాటిల్ నాగిరెడ్డి, హరి, అనిల్, శేఖర్, దాసు, డీలర్ ఎర్రిస్వామి, రమేష్, శివ, హనుమంతు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల భవన నిర్మాణానికి భూమి పూజ

విడపనకల్లు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యలయ ఆవరణలో దివ్యాంగుల భవ నిర్మాణం కోసం ఎంపీపీ కరణం పుష్పావతి భూమిపూజ చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మీటింగ్ హాల్ కొరకు స్థలం కేటాయించాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులను, అధికారులకు విన్నివించినా పట్టించుకోలేదని, వికలాంగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు వాపోయారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డిని కలసి వికలాంగుల సమస్యలను చెప్పుకున్న వెంటనే స్పందించి మండల కేంద్రంలో తహసీల్దారు కార్యలయం వరణంలోనే ఐదు సెంట్లు స్థలం కేటాయించారని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దివ్యాంగులంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి, పీసీ కమిటీ చైర్మన్ గిరిబాబు, నాయకులు సిద్దార్థ, హంపయ్య, ఉమాశంకర్, లాలెప్ప, వన్నూరప్ప, ప్రకాష్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు తనిఖీ

గుమ్మఘట్ట: నియోజకవర్గంలోని పలు తారు రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశారు. మండలంలోని బీఎస్‌హళ్లి క్రాస్ నుంచి నేత్రపల్లి వరకూ ఏఎంసీ నిధులతో నిర్మించిన తారురోడ్డును ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జునమూర్తి, ఏఈఈ తిరుమల్‌రెడ్డి బుధవారం పరీక్షించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు ఆర్‌టీ కాంతారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ప్రాజెక్ట్ ఏఈఈ రామాంజనేయులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం రేపు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం ఈనెల 30న నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటేశులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని, కౌన్సిలర్లు అధికారులు హాజరు కావాలన్నారు.

'ఉన్నతి' పథకంపై సమీక్ష

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం ఉన్నతి పథకం (ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్)పై ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుకు ఉన్నతి పథకం ద్వారా మేలు జరిగేలా చూడాల న్నారు. వైకేపీ ఏపీఎం గుణశ్యాం మాట్లాడుతూ 2023–24కు సంబంధించి 290 మంది లబ్ధిదారులకు రూ.1.51 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీలు సుశీలారాణి, సుంకమ్మ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, సర్పంచు మోనాలిసా, త హసీల్దార్ అనిల్‌కుమార్, వైకేపీ సీసీలు, అనిమేటర్లు, మహిళా సంఘ సభ్యులు తదిత రులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ పూర్తి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లోని ఆరు (కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప) మండలాల్లో ఖరీఫ్‌లో పూర్తి స్థాయిలో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశామని ఏడీఏ యల్లప్ప తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో డివిజన్‌కు 21500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారన్నారు. ఇందులో ఇప్పటికే 21,125 మంది రైతులకు 20,164 క్వింటాళ్ల విత్తన వేరుశనగను ఆర్‌బీకేల ద్వారా అందించామన్నారు.

'ఫుట్‌బాల్'పై అంతర్జాతీయ క్రీడాకారులతో శిక్షణ



ఉరవకొండ: స్థానిక ఫుట్‌బాల్ క్రీడాకారుల్లో నైపుణ్యాలను పెంపొందించే దిశగా ఆర్డీటీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఫుట్‌బాల్ దిగ్గజంగా ఖ్యాతిగాంచిన అర్జెంటీనా జట్టు క్రీడాకారులతో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. బుధవారం ఉరవకొండలోని పోలీసు క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరానికి అర్జెంటీనా జట్టు క్రీడాకారులు మార్టిన్, టాటూ హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పీడీ మారుతీప్రసాద్, కానిస్టేబుల్ కులశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగవివక్ష నిర్మూలనపై అవగాహన

ఉరవకొండ: మండలంలోని మోపిడి ఎస్సీ కాలనీలో లింగవివక్ష నిర్మూలనపై బుధవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షేక్ మహ్మద్ షఫీ మాట్లాడుతూ మోపిడిలో లింగ నిష్పత్తిలో అధిక వ్యత్యాసం ఉండటం మగపిల్లల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ఆడపిల్లల జనన శాతం రోజురోజుకూ తగ్గిపోతుండటం ఆందోళన కల్గించే విషయమన్నారు. బాలురతో సమానంగా బాలికలను చూడాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియ, సీఓ భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

రోజుకు రూ.272 కూలి

కూడేరు: నిబంధనల మేరకు పనులను నాణ్యతగా చేస్తే దిన కూలి రూ.272 వర్తిస్తుందని బుక్కరాయసముద్రం క్లస్టర్ ఏపీడీ అనురాధ కూలీలకు సూచించారు. బుధవారం ఆమె మండలంలోని చోళసముద్రం, పి. నారాయణపురం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని కూలీలకు సూచించారు. కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ అసిస్టెంట్ రవి, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడు గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రైతులకు చెందిన పొలాల్లో వైర్లను చోరీ చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువ ద్వారా రైతులు పొలాలకు పైపులైన్‌లు వేసుకుని పంటలు సాగుచేసుకుంటున్నారు. ఒక్కో రైతు 40–100 మీటర్ల వరకూ కేబుల్ వేసుకున్నారు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన 30 మంది రైతులకు చెందిన వైర్లను కోసి ఎత్తుకెళ్లారు. ఒక్కొక్కరికి రూ.10వేల వరకూ నష్టం వాటిల్లినట్లు రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, విజయ్‌కుమార్, దేవరాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. చోరీలపై రైతులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు.

బక్రీద్ శుభాకాంక్షలు



విప్ కాపు రామచంద్రారెడ్డి



ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

రాయదుర్గం: ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాల పండుగ బక్రీద్ అని కొనియాడారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ.. ఈ పండుగ జరుపుకుంటారన్నారు. భక్తి భావానికి, విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ముస్లింలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఉరవకొండ: త్యాగాలు, దానధర్మలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్‌ఉల్‌ఆదా) ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు తీసుకోరావాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు వారు బుధవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. నియోజకవర్గంలోని ముస్లింకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిభావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సందేశమైన ఈ పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తి గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఉదయం 8.30 గంటలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర, ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరు కావాలన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కి గాయాలు

కూడేరు: మండలంలోని శివరాంపేట వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై బుధవారం వడ్ల బస్తాల లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తా పడింది. బళ్లారి నుంచి తమిళనాడుకు లారీ వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. గాయపడిన డ్రైవర్‌ను 108లో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

బ్రహ్మసముద్రం: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ ఎస్ దాసానాయక్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పండ్ల తోటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఈసీ జయప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్లు లావణ్య, అవినాష్, మంజునాథ్, బీఎఫ్‌టీ వన్నూర్‌స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలి

గుమ్మఘట్ట: అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. మండలంలోని భూపసముద్రం ప్రభుత్వ పాఠశాలలో 'నాడు–నేడు' పనులు , గ్రామ సచివాలయం, ఆర్బీకేలను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే ముమ్మరం

కుందుర్పి: వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామాల్లో చేపడుతున్న కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు అనూష, చాంద్‌బేగం తదితరులు సూచించారు. బుధవారం కుందుర్పి, జంబుగుంపల తదితర గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ జూలై 10,11 తేదీలలో అంగన్‌వాడీ సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. అంగవాడీహెల్పర్స్ యూనియన్ జెట్టు కార్యదర్శి పాతక్క, సెక్టార్ లీడర్లు రాధ, గోవిందమ్మ, వరలక్ష్మి, లక్ష్మీ, తులసి, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు

కూడేరు: మండలానికి జూనియర్ కళాశాల మంజూరైనట్లు ఎంపీపీ నారాయణ రెడ్డి బుధవారం తెలిపారు. ఇంటర్ విద్యను అభ్యసించడానికి మండలం నుంచి జిల్లా కేంద్రానికి విద్యార్థులు వెళ్లాలంటే ఇబ్బంది పడేవారన్నారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డికి వివరించానన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏప్రిల్‌లో నార్పలకు వచ్చినపుడు విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల మండలానికి మంజూరు చేయాలని వినతి పత్రాన్ని ఇచ్చానన్నారు. స్పందించిన ముఖ్యమంత్రి జూనియర్ కాలేజ్ మంజూరు చేశారన్నారు. కళాశాల మంజూరు చేసినందుకు సీఎంకు ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు.

30 లోపు ఈ–కేవైసీ చేయించుకోండి

ఉరవకొండ రూరల్: మండలంలోని రైతులు పీఎం కిసాన్‌కు ఈ–కేవైసీ చేయించుకోని వారు ఈ నెల 30 లోపు చేయించుకోవాలని ఏఓ శుభకర్ సూచించారు. బుధవారం మండలంలోని నింబగల్లు, వెలిగొండ రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతూ చిరుధాన్యాలను సాగుచేసి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా

ఉరవకొండ: ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కొంతమంది సిబ్బంది చెప్పిందే వేదం అన్న రీతిలో సమావేశాలు కొనసాగుతున్నాయని, ఐసీడీఎస్ కార్యాలయం ఉన్నా ప్రైవేట్ స్థలాల్లో సెక్టార్ మీటింగ్‌లు నిర్వహించడం సరైంది కాదని బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షురాలు వెలిగొండ పద్మావతి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఎదుట ఐసీడీఎస్ సిబ్బంది తీరును నిరసిస్తూ అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా చేపట్టారు. ఆమె మాట్లాడుతూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న శేఖర్ తాను చెప్పిందే వేదంగా వ్యవహరిస్తున్నాడని ఆమె ఆరోపించారు. పీడీ విచారణచేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష రేపు

కళ్యాణదుర్గం: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 30న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ పేర్లను స్థానిక ఆదర్శ పాఠశాలలో నమోదు చేసుకోవాలన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

కంబదూరు: మండల కేంద్రంలోని పౌరసరఫరాల గోదామును సివిల్ సప్లై డీఎం నీలమయ్య బుధవారం తనిఖీ చేశారు. నిల్వ ఉన్న స్టాక్ పరిశీలించి నిత్యావసర సరుకులను రేషన్ షాపులకు సక్రమంగా సరఫరా చేయాలని సూచించారు. సరుకుల సరఫరాలో తేడా వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కణేకల్లు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్‌నాయక్ సూచించారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో బుధవారం మలేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో డాక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ తిరుపాల్‌నాయక్, సూపర్‌వైజర్ శివ, ఏఎస్‌ఎం రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఆశ వర్కర్లు లాలెమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లకు 770 మంది రిజిస్ట్రేషన్

వజ్రకరూరు: మండలంలో డ్రిప్, స్ప్రింక్లర్లకు 770మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసు కున్నట్లు నియోజకవర్గ హార్టికల్చర్ అధికారి నెట్టికంటయ్య తెలిపారు. బుధ వారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023–24కు సంబంధించి ఇప్పటివరకు 770 మంది రైతులు 1,080 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అర్హులైన ప్రతి రైతుకూ ప్రభుత్వం డ్రిప్, స్ప్రింక్లర్లు అందచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోండి

కుందుర్పి: ఆర్డీటీ పర్యవేక్షణలో వాటర్‌షెడ్ గ్రామాల్లో చేపడుతున్న భూఅభివృద్ధి పనులు, డ్రైల్యాండ్ హార్టికల్చర్ తదితర వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ టెక్నికల్ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి సూచించారు.బుధవారం ఆయన మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సిబ్బందితో కలసి పరిశీలించారు. జంబుగుంపల పంచాయతీలోని కెంచంపల్లి, కొలిమిపాళ్యం, కలిగొలిమి, అప్పాజిపాళ్యం తదితర గ్రామాల్లో సంస్థ ఆధ్వర్యంలో భూ అభివృద్ధి పనులు, చెక్ డ్యాంల తవ్వకాలు, నీటికుంటల ఏర్పాటు, పండ్లతోటల పెంపకం, పాడిపరిశ్రమ తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్లతోటల సాగుచేసే రైతులకు సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్టీఓలు రామాంజనేయులు, వెంకటేశులు, రైతులు పాల్గొన్నారు.